# సజీవ ప్రేతం

**క**ళ్ళు సరిగా కనపడవు, చెవులు వినపడవు. పొద్దుటిపూట అరుగుమీద కూచుంటుంది. రోడ్డుమీద పొయ్యే వాళ్ళని చూస్తుందనుకోను. ఏదో ప్రపంచంలో ఉన్నట్టుంటుంది. ఏ మాలోచిస్తుంది? పూర్వ వృత్తాంతం ఎప్పుడైనా జ్ఞప్తికి తెచ్చుకుంటుందా? గడచినదాన్ని గురించి ఏమనుకుంటుంది? తన ఇప్పటిస్థితికి తన మీద ఎంత నేరం వేసుకుంటుంది? ఇతర్లమీద ఎంత నేరం వేస్తుంది? ఈ విషయాలన్నీ అడిగి తెలుసుకుందామనుకుంటాను. కాని సాహసం చాలదు. చూస్తూ చూస్తూ మురికిగుంట నెవరు కెలుకుతారు? గుడ్డీ, చెవుడూ కూడానూ! గట్టిగా అరవాలి.... ఇంతా చేసి నన్ను గుర్తిస్తుందో, గుర్తించదో!... 'జన్మలో ఆ మనిషిని నేనెరుగుదునంటే ఎవరు నమ్ముతారు?.... వనజాక్షి కోసం పరిచయం చేసుకుంటున్నాననుకుంటారు!' అని నన్ను నేను నిరుత్సాహ పరుచుకుంటాను.

ఒకప్పుడా మనిషిని నేను బాగానే ఎరుగుదును. చూడటానికి ముసిల్దానల్లే ఉంటుంది గాని ఆ మనిషి కెన్నో ఏళ్ళు లేవు. నా యీడుదే. యాభై రెండేళ్ళు. ఈ మనిషికి పెళ్ళికావటం నేనెరుగుదును. పదకొండేళ్ళవాణ్ని, నన్ను కాకుండా ఇంకోణ్ని చేసుకుందని నాకు కోపం కూడా వచ్చింది. పదమూడేళ్ళ వాడికే ఇచ్చేశారు. లేకపోతే నేనంత విచారించకపోదును.

చాలా మంచిపిల్ల. ఎవరూ ఒక్కమాట అని ఎరగరు. ఎంత ఓర్పు! ఇంటి పనంతా చేసేది. తొందరపడి అకారణంగా ఎవరన్నా ఓ మాట అన్నా మాట్లాడేది కాదు. కాని చిన్నతనం నించే చెడ్డ సహవాసాలబ్బి చెడిపోయింది. కాపరానికి పోక పూర్వమే ఒక స్కూలు కుర్రాడితో స్నేహం చేసింది. (అప్పట్లో పదమూడేళ్ళవాళ్ళు స్కూలు ఫైనలుకు రావటం ఎరగం.) ఇడ్డెన్లు అమ్మే మహలక్ష్మమ్మ సారథ్యం. పాలెపువారి వెనక ఇంట్లో సమావేశాలు. తల్లిదండ్రులు కనుక్కుని కొట్టారు. పడివూరుకుంది. కాని చేసేపని మానలేదు.

కాపరానికెళ్ళింది. కొంతకాలం సరిగానే ఉంది. మొగుడివేపు దగ్గిర చుట్టాలతోనే కత్తు కలిపింది. మొగుడి సంసారం పెద్ద కలసంసారం కాదు. బంధువుల ప్రాపకం ఆటే లేదు. అటువంటిది బంధువులిప్పుడు కలిసి రాసాగారు.... చాలాసార్లు పట్టుబడింది.

పెద్ద పెట్టున అల్లరి జరిగే అవకాశం లేకపోయింది. మొగుడు అసమర్థుడు, గట్టిగా తిరగబడి అయినా తేల్చలేకపోయినాడు.

ఆ విధంగా జరిగిపోయివుంటే ఎట్లా ఉండేదో, ఊళ్ళో ఉన్న రౌడీమూక మనిషి సంగతి పసికట్టారు. ప్రయత్నించారు. అందక పొయ్యేటప్పటికి అల్లరికి పూనుకున్నారు. అల్లరి జాస్తి అయింది. భరించలేక వాళ్ళకి లొంగిపోయింది.

కాపరానికి చాలా చెడ్డపేరు వచ్చింది. ఇల్లు కుక్కల దొడ్డి అయిపోయింది. అంతా అయిపోయాక మొగుడు మొగతనం ప్రకటించాడు. పెళ్ళాన్ని ఇంటోనుంచి పొమ్మన్నాడు. మారుమాట్లాడకుండా ఇల్లువదలి వెళ్ళిపోయింది.

ఇల్లు దాటించటానికి ఒక ఆసామీ సాయపడ్డాడు. ఒక నెల్లాళ్ళు ఆయన ఊళ్ళన్నీ తిప్పి డబ్బు బోలెడు తగలేసి పశ్చాత్తాపం వచ్చి, “ఛీ పాడుముండా! నీ కోసం ఇంత డబ్బు తగలేశాను. నన్ను నాశనం చేశావు!” అని తిట్టి, నడి సముద్రంలో వొదిలి వెళ్ళిపోయినాడు.

ఆ సమయానికి కడుపుతో ఉంది. ఆరోనెల. ఫలానిచోట రహస్యంగా కనవచ్చునని తెలిసి ఎవరినో సహాయం తీసుకుని వెళ్ళింది. కన్నది. వాళ్లు కానీ అడగలేదు. బాగానే పురుడు పోశారు.

అక్కడి కో పెద్ద మనిషి వచ్చాడు. మాటల సందర్భంలో ఈ మనిషిని గురించి విన్నాడు. తనవెంట తల్లినీ పిల్లనీ పట్టుకెళ్ళాడు.

తన అదృష్టాన్ని నమ్మలేకపోయింది. పెద్ద ఉద్యోగస్తుడు, సంస్కారం గలవాడు. బోలెడంత ఆస్తి ఉంది. బ్రాహ్మడుకాదు. ఏం కాకపోతే? ఆయనకి ప్రపంచంలో బ్రాహ్మణా బ్రాహ్మణ వ్యత్యాసాలూ, పట్టింపులూ లేవు. ఆయన ఇంటికి బ్రాహ్మలూ హరిజనులూ కూడా వస్తారు. పెద్ద పెద్ద ఉద్యోగస్తులు వస్తారు. కవులు వస్తారు. గాయకులూ, నటులూ వస్తారు, రాజకీయవేత్తలు వస్తారు.

అందరితోటీ “నా భార్య, నా పిల్ల” అని చెబుతాడు. తాను నూరు రూపాయల కాగితం చూసిన మొహం కాదని గ్రహించాడు. నగలు కొనిపెట్టాడు. సెకండు క్లాసులో రైలెక్కించాడు. డాక్ బంగళాలో విడిది చేయించాడు. తన కింద నౌకర్లనూ వంటవాళ్ళనూ పెట్టాడు.

ఇదంతా తనకెందుకు చేస్తున్నాడో తెలీదు. తన అదృష్టమనుకుంది. తరవాత తనలో ఏదో చూసి తనని అపరిమితంగా – ఏ మొగాడూ ఏ ఆడదాన్నీ ఎన్నడూ మోహించనంతగా – మోహించా డనుకుంది.

అతనికి వేరే భార్యాపిల్లలూ ఉన్నారు. వాళ్ళను అతను సరిగా చూడటం మానేసి చాలాకాలమయింది. కొన్నాళ్ళుగా అడ్డమైన ఆడవాళ్ళతోటీ తిరుగుతున్నాడని విన్నది.

రోజు బేరం వాళ్ళ దగ్గిర్నుంచి ఉద్యోగాలు చేసుకునే ఆడమేస్టర్ల వరకూ అన్ని రకాలవాళ్ళతోటీ అతనికి సంబంధం ఉంటూ వచ్చింది. ఆ విషయం అతను దాచలేదు. ఎంతో అందమైన ఆడవాళ్ళని ప్రసిద్ధికెక్కిన వాళ్ళను కూడా చూశాడు. అటువంటివాడు తనని తెచ్చి ఒక ఇంట్లో ఎందుకుపెట్టాడూ? ప్రేమ అయి ఉండాలనుకున్నది.

నిజమేమిటంటే, సంసార స్త్రీ లక్షణాలుంటూ జారిణికుండే భావస్వాతంత్ర్యం గల ఆడది అతనికి దొరకలేదు. "ఇది నా భార్య" అని చెప్పుకోవటానికి వీలుంటూ, పదిమంది ఎదటా తనపక్కన కూచోబెట్టుకోవడానికి ఈ మనిషి సరిపోయింది. నిజంగా తాళికట్టిన భార్య కాదు గనక భార్య మాదిరిగా బరువుగా ఉండదు. నడివీథిలో ఉన్న మనిషి గనక కృతజ్ఞతగా ఉంటుంది. డబ్బు మొహం చూడనిదిగనక తన డబ్బు చూసి ముగ్ధురాలై పోతుంది... ఇవే అతన్ని ఆకర్షించిన విషయాలు.

కాని ఈ విషయం కనుక్కోలేక మొదట్లో తన అదృష్టం అనుకుంది. ఎంతకాలమని తన అదృష్టాన్ని మెచ్చుకుంటుంది. తన గొప్పతనమే ననుకొంది. తనలో ఏదో ఆధిక్యత ఉందనీ, ఆ ఆధిక్యత చూసి దానికి దాసుడైనాడనీ అనుకుంది.

ఈ మాట అనుకున్న తర్వాత ఆత్మవిశ్వాసం – దాదాపూ అంతరించి పోయిన ఆత్మవిశ్వాసం – మళ్ళీ తిరిగి వచ్చింది. ఇంతకాలానికి తనకు తగ్గ మగవాడు దొరికాడు. తనకు తగిన స్థాయిలో డబ్బు ఖర్చుపెట్టే అవకాశం దొరికింది. అతను "నా భార్య" అని చెబుతున్నప్పుడు తన భార్యత్వం ఎందుకు వృధా పోనివ్వాలి. అతని దగ్గిరికి వచ్చేవాళ్ళంతా తనను ఎంతో గౌరవంగా చూస్తారు. రెండు మూడు వందలు సంపాదించేవాళ్ళు కూడాను! మొదట్లో ఇది చూసి నివ్వెరపడింది. కాని, రోజూ రుజువయే విషయం గురించి ఎంతకాలం నివ్వెరపడటం? ఈ పరిస్థితులకు అలవాటై పోసాగింది.

డబ్బు మహత్తు తెలిసిరాసాగింది. ప్రపంచంలో అనేక రకాల గొప్ప తనాలున్నై. కొందరు ప్లీడరీలోనూ, వైద్యంలోనూ గట్టివాళ్ళు, కొందరు కళల్లో గట్టివాళ్ళు, కొందరు తలలుమార్చటంలో గట్టివాళ్ళు. కాని అసలు గట్టితనం డబ్బులో ఉంది. డబ్బు కొండమీది కోతిని తెస్తుంది. అది వింతగాదు; డబ్బు ఆ కోతిని మనిషి చేసేస్తుంది... తనకు పరిచయం అయేవాళ్ళలో ఇతర గట్టితనాలన్నిటినీ తృణీకరించి డబ్బును నమ్ముకోవటం నేర్చుకుంది. ప్రపంచంలో రెండే రకాల మనుషులు: గొప్పవాళ్ళూ, సాదావాళ్ళూ. గొప్ప వాళ్ళ దగ్గిర డబ్బుంటుంది. మిగతావాళ్ళ దగ్గిర ఉండదు. తను గొప్పవాళ్ళలోది.

ఈ విషయం తన బంధువుల విషయంలోనే రుజువు చెయ్యటానికి ఉపక్రమించింది. కన్నవారివైపు బంధువుల్ని తన దగ్గిరికి ఉత్తరాల ద్వారా ఆహ్వానించింది. మొదట్లో కొద్దిమందే వచ్చారు. రాను రాను దాదాపు అందరూ వచ్చారు. తన గొప్పతనం కొంత తమక్కూడా

రాచుకున్నారు. తను ఇచ్చిన బహూకృతులు స్వీకరించారు. అంతో ఇంతో చేబదుళ్ళు కూడా పుచ్చుకుని పోసాగారు... తాను చేసినపనికి సాంఘిక సమ్మతి కూడా లభించింది. ఇంకేం?

డబ్బు మహిమ ఈ విధంగా రుజువు చేసుకుని మామూలు మనుషుల్ని గురించి ఆలోచించటం మానేసి గొప్పవాళ్ళ ప్రపంచంలో పడింది. సంపాదనలో తేడాలను బట్టి ఎవరి నెంతదూరంలో ఉంచాలో చక్కగా – ఒక విద్యగా – అభ్యసించింది. ఊళ్ళో ఉన్న పది పెద్దకొంపల్లోనూ ఏం జరిగినా తనులేకుండా జరగదు. ఎవరు ఏ రవ్వల కమ్మలు చేయించినా, ఏ టిస్యూచీరెకొన్నా, గొప్ప పిల్లకు ఏ గొప్ప సంబంధం కుదిరినా, ఊళ్ళోకి ఏ ఐ.సి.ఎస్. ఉద్యోగి వచ్చినా ముందు తనకు తెలియాలి.

"ఇది రాబట్టే ఆ ముండాకొడుకు బొత్తిగా భార్యా బిడ్డల్ని చూడకుండా ఉన్నాడు" అని అన్నవాళ్ళు లేకపోలేదు. అది తనకు కీర్తేనని భావించింది. అందులో తన అఖండ విజయమే చూసుకుంది. తన ప్రపంచం అవతల ఎంత మందికో ఎన్నో అవకతవకలు జరుగుతై, ఎవరి ఖర్మ వాళ్ళది.

"మీరే నాకు ప్రపంచంకాదు. నాకివతల బ్రహ్మాండమైన వాళ్ళున్నారు" అని తన అయినవాళ్ళకు చూపించింది. ఒకప్పుడు దర్పంగా తన దగ్గరికి వచ్చిన బంధువు లిప్పుడు వినయంగా భయభక్తులు ప్రకటిస్తూ వచ్చారు. వాళ్ళు లొంగిన కొద్దీ తన నిడువు పెంచింది. ఒక్కొక్కరే జారిపోయినారు.

పిల్ల, వనజాక్షి ఎదిగివచ్చింది, పెళ్ళి చెయ్యాలి. ఉన్న గొప్ప సంబంధాల్లో ఏదో ఒకటి అవుతుంది. ముఖ్యమైన విషయం ఏమిటంటే పిల్లకు లక్షాధికారి లక్షణాలు అలవరచటం, తను దరిద్రంలో పుట్టికూడా నేర్చిన లక్షణాలు వనజాక్షికి రాకపోతాయని భయంలేదు. సులభంగానే వచ్చినై కూడానూ.

అయితే పేకలమేడ ఒక్కసారిగా కూలింది. అతను ఏదో అర్జంటుపనిమీద ఇంటికి వెళ్ళాడు, జబ్బు చేసింది, బరువయింది, చచ్చిపోయినాడు. అప్పటికప్పుడు ఆస్తంతా పెళ్ళాం పిల్లలు రాయించుకున్నారు.

వీథిలో నిలబడింది. ఇంట్లో వస్తువులున్నై, డబ్బు లేదు, వొంటిమీద నగలున్నై. అంతే, నలభైదాటినై, తనని ఎవరు చేపడతారు? తనకీ నరకానికీ మధ్య ఎవరడ్డం నిలబడతారు? బంధువులు అంతా జారారు. వాళ్ళకిచ్చేటందుకు తన దగ్గరేముంది? తనకు పిన్నులూ, వొదినెలూ, అత్తలూ, అమ్మమ్మలూ అయిన గొప్పవాళ్ళు... పరామర్శించటానికి అందరూ వచ్చారు. మర్నాటినుంచి ఎవరు అయిపులేదు. నౌకర్లనందర్నీ వెళ్ళగొట్టి చిన్న ఇల్లు తీసుకుంది. గొప్పవాళ్ళ ఇళ్ళచుట్టూ చాంద్రాయణం ప్రారంభించింది.

ఎవరికీ తనతో స్థిమితంగా మాట్లాడే టైములేదు. పాపం, తనను డ్రాయింగు రూములో కూచోబెట్టి భోజనాలకు వెళ్ళారు. తాము కారులో సినిమాలకు బయల్దేరుతూ, 'మళ్ళీ కనిపిస్తావుగా?' అన్నారు. అదివరకల్లా రోజూ తనకోసం ఎదురుచూసేవాళ్లే. "ఎప్పుడైనా కనిపిస్తూ ఉండు. ఆయన పోయినాడని ఎడమైపోకు" అని అతిథ్యం ఇచ్చి, ఆ మాటమీద తను రోజూ వస్తూపోతూంటే మొహాలు మాడ్చుకున్నారు.

గొప్పవాళ్ళ వైభవం తన జన్మకు అయిపోయింది.

పిల్లకు పెళ్ళికాలేదు. "కాకుండానే చచ్చాడు. వాడిచావు నిచ్చావుగానూ!"

వనజాక్షిని గొప్పవాడు చేసుకునే ఆశపోయింది. కొద్దివాడు చేసుకునే ఆశకూడా త్వరలోనే పోయింది. అసలు పెళ్ళి అయే ఆశేపోయింది –

వనజాక్షిని ఇప్పుడెవడో ఉంచుకున్నాడు. ఏదో కంపెనీ హార్మోనియం వాయిస్తాట్ట – తాగివచ్చి చచ్చేట్టు కొడతాడు.

ఏం కొట్టినా తనకేమీ కనిపించదు. వినిపించదు – అట్లా అరుగుమీద కూచుని ఏమిటో ఆలోచిస్తుంది. ఏమిటాలోచిస్తుంది? అడుగుదామా అనుకుంటాను....

అయినా మనకెందుకు? చూస్తూ చూస్తూ మురికిగుంట నెవడు కెలుకుతాడు.

*ముద్రణ : కథా వాహిని - 2, కొడవటిగంటి కథలు, 1954*
*ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ*